బలగం TV
BALAGAM
నిజమే మా బలం.. ప్రజలే మా బలగం
BALAGAM TV DIGITAL NEWS PAPER | balagamtv100@gmail.com
హైదరాబాద్ శుక్రవారం 27 డిసెంబర్ 2024 | www.balagamtv.com | పేజీలు 4

## గ్రూప్-1 పరీక్షపై అభ్యర్థుల పిటిషన్‌ను కొట్టేసిన హైకోర్టు

### మార్చి నాటికి గ్రూప్-1 ఫలితాలు ప్రకటిస్తా: బుర్రా వెంకటేశం




బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో

టీజీపీఎస్సీ నిర్వహించిన గ్రూప్-1 పరీక్షపై అభ్యర్థులు దాఖలు చేసిన పిటిషన్‌ను తెలంగాణ హైకోర్టు కొట్టివేసింది. రిజర్వేషన్లతో పాటు పలు అంశాలపై అభ్యర్థులు కోర్టును ఆశ్రయించారు. రిజర్వేషన్లు తేలేంత వరకు గ్రూప్-1 ఫలితాలు ప్రకటించొద్దని కోర్టుకు అభ్యర్థులు విజ్ఞప్తి చేస్తూ పలు పిటిషన్లు దాఖలు చేశారు. ఫలితాలు నిలిపివేసేలా ఆదేశాలు జారీ చేయాలని కోర్టును కోరారు. ఈ పిటిషన్లపై విచారణ చేపట్టిన కోర్టు.. ఫలితాలు నిలిపివేయాలంటూ దాఖలైన పిటిషన్లను కోర్టు కొట్టివేసింది. ఈ ఏడాది అక్టోబర్ 21 నుంచి 27 వరకు గ్రూప్- 1 మెయిన్స్ పరీక్షలు నిర్వహించిన సంగతి తెలిసిందే. వచ్చే ఏడాది మార్చి నాటికి గ్రూప్-1 ఫలితాలు ప్రకటిస్తామని ఇటీవలే టీజీపీఎస్సీ చైర్మన్ బుర్రా వెంకటేశం ప్రకటించారు.

# తెలుగు సినీ పరిశ్రమకు
# బ్రాండ్ క్రియేట్ చేయాలి



- సినీ రంగానికి హైదరాబాద్ ఒక కేంద్ర బిందువుగా ఉండాలి
- హాలీవుడ్, బాలీవుడ్ సైతం హైదరాబాద్ వచ్చేలా చర్యలు
- నాకు వ్యక్తిగత అభిప్రాయాల్లేవు
- సినీ పరిశ్రమకు తగిన ప్రాధాన్యం
- ప్రభుత్వ కార్యక్రమాల్లో భాగస్వాములు కండి
- సమస్యల పరిష్కారానికి మంత్రివర్గ ఉపసంఘం
- యాంటీ డ్రగ్స్ క్యాంపెయిన్‌కు సహకరించాలి
- కులగణన సర్వేపై ముందుకు రావాలి
- టికెట్ల ధరలపై విధించే సెస్‌ను స్కూల్స్‌కి వినియోగిస్తాం
- సినీ ప్రముఖుల భేటీలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ రైజింగ్ లో భాగంగా తెలుగు సినిమా పరిశ్రమకు ప్రపంచ వ్యాప్తంగా ఒక బ్రాండ్ క్రియేట్ చేయాలని నిర్ణయం తీసుకున్నట్టు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. సినీ రంగానికి హైదరాబాద్ ఒక కేంద్ర బిందువుగా ఉండేలా హాలీవుడ్, బాలీవుడ్ సైతం హైదరాబాద్ వచ్చేలా చర్యలు చేపడతామని టాలీవుడ్ పెద్దలతో జరిగిన సమావేశంలో తెలిపారు.

వివిధ చిత్ర పరిశ్రమ సమస్యలపై చర్చించేందుకు టాలీవుడ్ ప్రతినిధులు గురువారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో భేటి అయ్యారు. ఈ సమావేశంలో సినీ పరిశ్రమ నుంచి దిల్ రాజు , అల్లు అరవింద్, సురేష్ బాబు, మురళీమోహన్, నాగార్జున, త్రివిక్రమ్, హరీష్ శంకర్, కొరటాలశివ, వశిష్ఠ, సాయిరాజేష్, సి.కల్యాణ్, వెంకటేశ్ , నితిన్ , కిరణ్ అబ్బవరం, సిద్ధూ జొన్నలగడ్డ వంశీపైడిపల్లి, అనిల్ రావిపూడి, బోయపాటి శీను, వీరశంకర్ , హరీశ్ శంకర్ , ప్రశాంత్ వర్మ, సాయి రాజేశ్, వశిష్ట, సుధాకర్ రెడ్డి, గోపి ఆచంట, శ్యాంప్రసాద్ రెడ్డి, బీవీఎస్ ప్రసాద్ , కె.ఎల్ నారాయణ, మైత్రీ రవి, నవీన్ తదితరులు హాజరయ్యారు.. మొత్తం సీని పరిశ్రమ నుంచి 36 మంది సభ్యులు పాల్గొనగా వారిలో 12 మంది నిర్మాతలు, 13 మంది దర్శకులు, 11 మంది నటులు ఉన్నారు. ఇక ప్రభుత్వం తరుపున రేవంత్ తో పాటు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క,సినిమాటోగ్రఫీ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి. దుద్దిళ్ల శ్రీధర్ బాబు పాల్గొన్నారు. కాగా, మెగాస్టార్ చిరంజీవి విదేశాలలో ఉండటంతో ఈ బేటికి హాజరుకాలేక పోయినట్లు సమాచారం.

తెలంగాణ రాష్ట్రం పురోభివృద్ధి సాధించడంలో ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, ఫార్మా రంగాలతో పాటు సినిమా పరిశ్రమకు కూడా ప్రజా ప్రభుత్వం తగిన ప్రాధాన్యతను ఇస్తోందని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. తెలుగు సినిమా పరిశ్రమకు ఎదురయ్యే సమస్యల పరిష్కారానికి మంత్రివర్గ ఉపసంఘం నియమిస్తున్నట్టు ముఖ్యమంత్రి ప్రకటించారు. సినిమా పరిశ్రమ అభివృద్ధి చెందడానికి ప్రజా ప్రభుత్వం ప్రత్యేకంగా ప్రోత్సాహం అందిస్తోందని గుర్తుచేశారు. పరిశ్రమ పురోభివృద్ధికి, ఒక సానుకూల వాతావరణం ఏర్పాటుకు సినీ పరిశ్రమ వైపు నుంచి కూడా ఒక కమిటీని ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి గారు పలు విషయాలను చెప్పారు.

తెలుగు సినిమా పరిశ్రమకు ప్రపంచ వ్యాప్తంగా ఒక బ్రాండ్ క్రియేట్ చేయాలని నిర్ణయం తీసుకున్నాం. పరిశ్రమ బాగుండాలని కోరుకుంటున్నాం. సినీ రంగానికి హైదరాబాద్ ఒక కేంద్ర బిందువుగా ఉండేలా హాలీవుడ్, బాలీవుడ్ సైతం హైదరాబాద్ వచ్చేలా చర్యలు చేపడతాం. హైదరాబాద్‌లో పెద్ద సదస్సు నిర్వహించి ఇతర సినిమా పరిశ్రమలను ఆకట్టునే ప్రయత్నం చేస్తున్నాం. ముంబైలో వాతావరణం కారణంగా బాలీవుడ్ అక్కడ స్థిరపడింది.

**సినిమా పరిశ్రమ ఎదుగుదలకు హైదరాబాద్ బెస్ట్**

దేశంలోని కాస్మోపాలిటన్ సిటీల్లో సినిమా పరిశ్రమ ఎదుగుదలకు హైదరాబాద్ బెస్ట్ సిటీ. తెలంగాణలో అవార్డులు ఇవ్వడం లేదని తెలిసి గద్దర్ పేరుతో అవార్డును ఏర్పాటు చేశాం. ప్రభుత్వం, సినిమా పరిశ్రమకు అనుసంధాన కర్తగా ఉండేందుకు దిల్ రాజు గారిని ఎఫ్‌డీసీ ఛైర్మన్‌గా నియమించాం. తెలంగాణలో ఎక్కడైనా షూటింగ్ చేసుకుని

మిగితా 2వ పేజీలో

### మాజీ ప్రధాని
## మన్మోహన్ సింగ్ కన్నుమూత



బలగం టీవి, న్యూఢిల్లీ

మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ (92) కన్నుమూశారు. గురువారం సాయంత్రం ఆయన అస్వస్థతతో ఢిల్లీ ఎయిమ్స్‌లో చేరగా అత్యవసర విభాగంలో చికిత్స అందించారు. అయితే ఆరోగ్య పరిస్థితి విషమించడంతో తుదిశ్వాస విడిచారు. ఈ మేరకు ఎయిమ్స్ ప్రకటన విడుదల చేసింది.

**పంజాబ్ ప్రావిన్స్ లో జననం**

మన్మోహన్ సింగ్ 1932 సెప్టెంబర్ 26న అవిభాజిత భారతదేశ పంజాబ్ ప్రావిన్స్ లో జన్మించారు. డాక్టర్ సింగ్ 1948లో పంజాబ్ యూనివర్సిటీ నుంచి మ్యాట్రిక్యులేషన్ పరీక్షలు పూర్తి చేశారు. ఆయన విద్యా ప్రయాణం పంజాబ్ నుంచి యూకేలోని కేంబ్రిడ్జ్ విశ్వవిద్యాలయంలో 1957లో ఆర్థికశాస్త్రంలో ఫస్ట్ క్లాస్ హానర్స్ డిగ్రీ పొందడం వరకు సాగింది. ఆ తర్వాత డాక్టర్ సింగ్ తర్వాత ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీ నుండి 1962లో ఆర్థికశాస్త్రంలో డి.ఫిల్ పొందారు.మన్మోహన్ సింగ్ అనేక గొప్ప రచనలు చేశారు. ఆయన రచించిన "ఇండియాస్ ఎగ్‌స్పోర్ట్ ట్రెండ్స్ అండ్ ప్రాస్పెక్ట్స్ ఫర్ సెల్ఫ్-స్టెయిన్డ్ గ్రోత్" (క్లారెండన్ ప్రెస్, ఆక్స్ఫర్డ్, 1964) అనే పుస్తకం భారతదేశ అంతర్గత దృష్టికోణంలోని వాణిజ్య విధానంపై ఒక ప్రారంభ విమర్శగా గుర్తించబడింది. తన అకాడమిక్ జీవితం పంజాబ్ యూనివర్సిటీ, ప్రతిష్టాత్మక డెల్హీ స్కూల్ ఆఫ్ ఎకానమిక్స్‌లో పని చేసిన సంవత్సరాలతో మరింత పటిష్టంగా తన ఆర్థిక నైపుణ్యలను పెంచుకున్నారు.

ఈ సంవత్సరాలలో ఆయన యూఎన్‌సీటీఏడీ కార్యాలయంలో కొంత సమయం పనిచేశారు. 1987 నుండి 1990 వరకు ఆయన జెనీవాలోని సౌత్ కమిషన్ కార్య దర్శిగా నియమితులయ్యారు. 1971లో డాక్టర్ మన్మోహన్ సింగ్ భారత ప్రభుత్వంలో వాణిజ్య మంత్రిత్వ శాఖలో ఆర్థిక సలహాదారుగా చేరారు. తరువాత 1972లో ఆర్థిక మంత్రిత్వ శాఖలో ప్రధాన ఆర్థిక సలహాదారుగా నియమితులయ్యారు. అలాగే, ఆర్థిక మంత్రిత్వ శాఖలో కార్యదర్శి, ప్లానింగ్ కమిషన్ ఉపాధ్యక్షుడు, భారత రిజర్వ్ బ్యాంక్ గవర్నర్, ప్రధాన మంత్రికి సలహాదారుగా, యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ చైర్మన్‌గా కూడా పనిచేశారు.1991 నుండి 1996 వరకు డాక్టర్ సింగ్ భారత దేశ ఆర్థిక మంత్రిగా పనిచేసిన కాలం భారతదేశపు స్వతంత్ర ఆర్థిక చరిత్రలో ఒక కీలకమైన మలుపుగా మారింది. ఆ కాలంలో ఆర్థిక సంస్కరణల విధానాన్ని ప్రారంభించిన ఆయన ప్రపంచవ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపు సాధించారు. డాక్టర్ మన్మోహన్ సింగ్ నిరాడంబర జీవితం గడుపుతున్నారు. ఆయన ప్రజా సేవా జీవితంలో పొందిన అనేక పురస్కారాలు, గౌరవాలు ఉన్నాయి. అందులో ప్రముఖమైనవి భారతదేశపు రెండవ అత్యున్నత పౌర పురస్కారం అయిన పద్మ విభూషణ్ (1987), జవహర్లాల్ నెహ్రూ జయంతి శతాబ్ది పురస్కారం (1995), ఆసియా మనీ అవార్డు ఫర్ ఫైనాన్స్ మినిస్టర్ ఆఫ్ ది ఇయర్ (1993-1994), యూరో మనీ అవార్డు ఫర్ ఫైనాన్స్ మినిస్టర్ ఆఫ్ ది ఇయర్ (1993), యూనివర్సిటీ ఆఫ్ కేంబ్రిడ్జ్ యొక్క ఆడమ్ స్మిత్ ప్రైజ్ (1956), సెంట్రల్ లండన్ లోని సెంట్ జాన్ కాలేజ్ ద్వారా ప్రదర్శనలో ప్రఖ్యాతి చెందిన

మిగితా 2వ పేజీలో

### ప్రధాని మోడీ సంతాపం

మన్మోహన్‌సింగ్ మృతిపట్ల ప్రధాని మోడీ సంతాపం తెలిపారు. దేశం విశిష్ట నాయకుడిని కోల్పోయిందన్నారు. భారత ఆర్థిక వ్యవస్థపై మన్మోహన్‌సింగ్ చెరగని ముద్ర వేశారని కొనియాడారు. ప్రజల జీవితాలను మెరుగుపరిచేందుకు విశేషంగా కృషి చేశారన్నారు.

### కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే సంతాపం

"దేశం దూరదృష్టి కలిగిన రాజనీతిజ్ఞుడిని కోల్పోయింది. మన్మోహన్ ఆర్థిక విధానాలు దేశంలో పేదరికాన్ని తగ్గించింది. మన్మోహన్‌ను దేశం ఎప్పుడూ కృతజ్ఞతతో గుర్తుపెట్టుకుంటుంది" అని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే అన్నారు.

### గురువును కోల్పోయాను : రాహుల్ గాంధీ

కాంగ్రెస్ పార్టీ కురువృద్ధుడు, మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ మృతి పట్ల లోక్ సభలో విపక్ష నేత, కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ స్పందించారు. మన్మోహన్ మృతితో తాను ఒక గురువును, మార్గదర్శిని కోల్పోయానంటూ తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ఈ విషాద సమయంలో మన్మోహన్ సింగ్ అర్ధాంగికి, ఇతర కుటుంబ సభ్యులకు ప్రగాఢ సంతాపం తెలియజేసుకుంటున్నానని రాహుల్ గాంధీ ట్వీట్ చేశారు. మన్మోహన్ సింగ్ ప్రధానిగా దేశాన్ని విశేష పరిజ్ఞానం, సమగ్రతతో నడిపించారని కొనియాడారు. ఆయన మృదు స్వభావం, ఆర్థికశాస్త్రంపై ఆయన లోతైన అవగాహన జాతికి స్ఫూర్తినిచ్చాయని పేర్కొన్నారు. కోట్లాది మంది అభిమానులు ఆయనను అత్యంత గర్వంగా గుర్తుంచుకుంటారని తెలిపారు.

## బీసీ కులగణనపై బీజేపీ వైఖరి చెప్పాలి

- ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత



బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో

బీసీ కులగణనపై బీజేపీ తన వైఖరేంటో చెప్పాలని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు. కాంగ్రెస్ బీసీలకు ఇచ్చిన హామీలు, కామారెడ్డి డిక్లరేషన్ అమలుపై ఆ ప్రభుత్వాన్ని బీజేపీ ఎందుకు నిలదీయడం లేదని ప్రశ్నించారు. బీసీలంటే ఆ పార్టీకి పార్టీకి లెక్కలేదా అని ప్రశ్నించారు. గురువారం కుమ్మరి సంఘం నేతలు హైదరాబాద్‌లోని కవిత నివాసంలో ఆమెను కలిశారు. బీసీలు, ముఖ్యంగా కులవృత్తుల వారు ఎదుర్కొంటున్న సమస్యలను వారు ఆమె దృష్టికి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... బీసీలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని స్పష్టం చేశారు. కులవృత్తులను కుదేలు చేస్తోందని విమర్శించారు. ముఖ్యంగా బీసీల సంక్షేమాన్ని, అభివృద్ధిని ప్రభుత్వం గాలికొదిలేసిందని తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని ఇచ్చిన హామీను కాంగ్రెస్ ప్రభుత్వం విస్మరిస్తున్నదని పేర్కొన్నారు.

### ఏడో గ్యారెంటీగా ఎమర్జెన్సీని అమలుచేస్తున్న ముఖ్యమంత్రి

ఎర్రోళ్ల శ్రీనివాస్‌ను అక్రమంగా అరెస్టుచేయడం దుర్మార్గమైన చర్య
బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

వివరాలు 2వ పేజీలో



## జన గణనలోనే కులగణన చేపట్టాలి

- సీఎం రేవంత్ రెడ్డి ప్రతిపాదన, సీడబ్ల్యూసీ తీర్మాణం

బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో

జనగణనలో కుల గణన చేపట్టాలని సీడబ్ల్యూసీ సదస్సులో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రతిపాదించారు. కుల గణనలో తెలంగాణ దేశానికే ఆదర్శంగా నిలిచిందని తెలిపారు. బెళగావిలో గురువారం జరిగిన సీడబ్ల్యూసీ సదస్సులో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రసంగించారు. కులగణన చేపట్టడం ద్వారా తెలంగాణ దేశానికే మార్గదర్శిగా ఉందన్నారు. కేంద్ర ప్రభుత్వం వచ్చే ఏడాది దేశవ్యాప్తంగా చేపట్టనున్న జనగణనలో కులగణన కూడా చేపట్టాలని.. ఈ విషయపై కాంగ్రెస్ పోరాటం చేయాలన్నారు. ఈ విషయంలో సీడబ్ల్యూసీ ఒక తీర్మాన చేసి కేంద్ర ప్రభుత్వానికి పంపించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచించారు. ఈ ప్రతిపాదనకు సీడబ్ల్యూసీ ఏకగ్రీవంగా తీర్మానాన్ని ఆమోదించింది. త్వరలో చేప్టటనున్న నియోజకవర్గాల పునర్విభజనలోనూ ఏఐసీసీ తగు జాగ్రత్తలు తీసుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అభిప్రాయపడ్డారు. జనాభా ప్రాతిపదికన నియోజకవర్గాల పునర్విభజన చేస్తే దక్షిణాది రాష్ట్రాలు ఎక్కువగా నష్టపోయే ప్రమాదం ఉందన్నారు. ఈ విషయంలో ఏఐసీసీ వ్యూహాత్మకంగా వ్యవహరించి అత్యంత జాగ్రత్తగా ముందడుగు వేయాలన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ప్రవేశపెట్టిన మహిళా బిల్లు కొలిక్కి వచ్చిన నేపథ్యంలో దానిపై కాంగ్రెస్ పార్టీనే ఎక్కువగా ప్రచారం చేయాల్సి ఉందని రేవంత్ రెడ్డి సూచించారు. మహిళా బిల్లు విషయంలోనూ బీజేపీ రిజర్వేషన్లను తనకు అనుకూలంగా చేసుకునే అవకాశాలున్నందున కాంగ్రెస్ అత్యంత అప్రమత్తంగా వ్యవహరించాలని వ్యాఖ్యానించారు.

### సంక్రాంతి నాటికి
## మొదటి విడతగా 4.50 లక్షల ఇందిరమ్మ ఇండ్లు



- మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి
- భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో పర్యటన

బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో

సంక్రాంతి పండుగ నాటికి మొదటి విడతగా రాష్ట్రంలో 4.50 లక్షల ఇందిరమ్మ ఇండ్లను పేదలకు అంది స్తామని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఖమ్మం పార్లమెంట్ సభ్యుడు రామ సహాయం రఘురామరెడ్డి, ఎమ్మెల్యే జారే ఆదినారాయణ, నీటిపారుదల అభివృద్ధి సంస్థ ఛైర్మన్ మువ్వా విజయబాబుతో కలిసి గురువారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, దమ్మపేట మండలం, నాచారం, గున్నేపల్లి గ్రామాల్లో నూతనంగా నిర్మించిన పంచాయతీ భవనాలను ఆయన ప్రారంభించారు. దమ్మపేట మండలంలో ఇందిరమ్మ ఇండ్ల నమూనా భవనానికి శంకుస్థాపన చేసి, అక్కడ ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రసంగించారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడుతూ..

రాష్ట్రంలో అర్హులైన ప్రతి ఒక్క పేదవారికి ఇండ్లు నిర్మిస్తామని, ప్రభుత్వంలో ఎన్ని ఆర్థిక ఇబ్బందులు ఉన్నా ఇందిరమ్మ ఇండ్లు కట్టి తీరుతామని స్పష్టం చేశారు. 10 ఏళ్ల బిఆర్ఎస్ పాలనలో ప్రజలకు ఒరిగిందేమీ లేదని, ఆ పార్టీ నాయకులు కేవలం మాటలకే పరిమితమయ్యారు తప్ప, ప్రజలకు చేసిందేమీ లేదన్నారు. ప్రజలు ఎంతో నమ్మకంతో గెలిపించిన కాంగ్రెస్ పాలనలో అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇల్లు కట్టించి తీరుతామని అన్నారు. ఇప్పటికే రాష్ట్రంలో ఇందిరమ్మ ఇండ్ల కోసం 85 లక్షల మంది దరఖాస్తు చేసుకున్నారని, వారికోసం ప్రత్యేక యాప్ ద్వారా సమాచారం సేకరిస్తున్నామని

మిగితా 2వ పేజీలో

## ఎస్ఐ, మహిళా కానిస్టేబుల్, సింగిల్ విండో జూనియర్ అసిస్టెంట్ ఆత్మహత్య

- కామారెడ్డిలో మిస్టరీగా మారిన ముగ్గురి ఆత్మహత్యలు
- పోస్టుమార్టం ఆధారంగా వెల్లడిస్తామన్న ఎస్పీ

బలగం టీవి, హైదరాబాద్

ఎస్ఐ, మహిళా కానిస్టేబుల్, సింగిల్ విండో కార్యాలయంలో పనిచేస్తున్న జూనియర్ అసిస్టెంట్ ముగ్గురు ఒకేసారి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర సంచలనం సృష్టించింది. కామారెడ్డి జిల్లా, సదాశివనగర్ మండలం, అడ్లూర్ ఎల్లారెడ్డి పెద్ద చెరువులో బుధవారం రాత్రి ఈ ఘటన చోటుచేసుకుంది. భిక్కనూర్ ఎస్ఐగా పనిచేస్తున్న సాయికుమార్, బీబీపేట పోలీస్‌స్టేషన్‌లో మహిళా కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న శృతి, బీబీపేట సింగిల్ విండో కార్యాలయంలో

మిగితా 2వ పేజీలో

## 17 మంది బాలలకు పురస్కారాలు ప్రదానం



బలగం టీవి, న్యూఢిల్లీ బ్యూరో

కళ,సంస్కృతి,క్రీడలు తదితర వివిధ రంగాల్లో అసమాన ప్రతిభ చూపించిన 17 మంది బాలలకు రాష్ట్రపతి ద్రౌపది ముర్మ ప్రధాన మంత్రి రాష్ట్రీయ బాల పురస్కారాలని గురువారం ప్రదానం చేశారు. యవత ప్రతిభను పోషించడం, ప్రోత్సహించడం ప్రాముఖ్యతను వివరించారు. బాలల ప్రతిభను గుర్తించి, తగిన అవకాశాలు కల్పించడం మన సంప్రదాయంలో ఒక భాగమని సూచించారు. ప్రతి బాలుడు లేదా బాలిక తమ శక్తిని, ప్రతిభను తెలుసుకునేలా ఈ సంప్రదాయాన్ని మరింత బలోపేతం చేయవలసిన అవసరం ఉందన్నారు. విజేతలు ఏడు కేటగిరీల్లో అవార్డులు పొందారు. విజేతల్లో ఏడుగురు బాలురు కాగా, పదిమంది బాలికలు ఉన్నారు. 14 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల నుంచి వీరిని ఎంపిక చేశారు. వీరికి ఒక్కొక్కరికి మెడల్, సర్టిఫికెట్ ,సైటేషన్ బుక్‌లెట్ ప్రదానం చేయడమైంది.

## ఎర్రోళ్ల శ్రీనివాస్ అరెస్ట్... బెయిల్ మంజూరు

- సీఐ విధులకు ఆటంకం కలిగించిన కేసులో అరెస్టు చేసిన పోలీసులు



బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో

బీఆర్ఎస్ నాయకులు, మాజీ ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ ఎర్రోళ్ల శ్రీనివాస్ ను బంజారా హిల్స్ పోలీసులు అరెస్టు చేశారు. గురువారం తెల్లవారుజామున హైదరాబాద్ లోని వెస్ట్ మారెడ్ పల్లి లోని ఎర్రోళ్ల శ్రీనివాస్ ఇంటికి వెళ్లిన పోలీసులు ఆయన అదుపులోకి తీసుకొని మా సబ్ ట్యాంక్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. బంజారాహిల్స్ పిఎస్ లో సీఐరాఘవేంద్ర తన విధులకు ఆటంకం కలిగించారని ఫిర్యాదు చేయడంతో డాక్టర్ ఎర్రోళ్ల శ్రీనివాస్, హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డిపై కేసు నమోదు చేసిన పోలీసులు వారికి నోటీసులు పంపారు. నోటీసులు అందుకున్నప్పటికీ ఎర్రోళ్ల శ్రీనివాస్ పోలీసు స్టేషన్లో హాజరు కాకపోవడంతో పోలీసులు ఆయనను అరెస్టు చేసేందుకు మారెడుపల్లిలోని ఆయన ఇంటికి చేరుకున్నారు. పోలీసులను చూసిన ఎర్రోళ్ల శ్రీనివాస్ ఇంటి తలుపులు మూసుకున్నారు. ఎంతకు తలుపులు తెవరక పోవడంతో పోలీసులు ఆయనను అదుపులోకి తీసుకునేందుకు ఉపక్రమించగా సమాచారం అందుకున్న బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ఆయన ఇంటి వద్దకు పెద్ద ఎత్తున తరలివచ్చారు. ఎర్రోళ్ల శ్రీనివాసన్ అరెస్టు చేయ రాదంటూ పోలీసులతో వాగ్వాదానికి దిగారు. పోలీసు వాహనం కదలకుండా అడ్డుకున్నారు. సీఎం డౌన్ ...డౌన్ అంటూ పెద్దపెట్టున నినాదాలు చేశారు. దీంతో అక్కడ ఉద్రిక్త వాతావరణం నెలకొంది. పోలీసులు ఎంత సర్ది చెప్పినా కార్యకర్తలు వినక పో వ డంతో వాహనానికి అడ్డువచ్చిన బీఆర్ఎస్ కార్యకర్తలను పోలీసులు బలవంతంగా పక్కకు నెట్టి న ఎర్రోళ్ల శ్రీనివాస్ ను పోలీసు వ్యాన్ లో ఎక్కించుకొని మాసబ్ ట్యాంక్ పోలీస్ స్టేషన్ కు తరలించారు.


**బెయిల్ మంజూరు చేసిన కోర్టు.**

డాక్టర్ ఎర్రోళ్ల శ్రీనివాస్‌ను అరెస్టు చేసిన పోలీసులు వైద్య పరీక్షల కోసం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. వైద్య పరీక్షలు నిర్వహించిన అనంతరం ఆయను నాంపల్లి కోర్టులో హాజరు పరిచారు. వాదనలు విన్న న్యాయమూర్తి రూ.5వేల పూచికత్తు,ఇద్దరు ష్యూరిటీలతో షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేశారు.

**రెండు సార్లు నోటీసులు ఇచ్చాం : పోలీసులు...**

పోలీసుల విధులకు ఆటంకం కలిగించడంతో డాక్టర్ శ్రీనివాస్‌పై బంజారా హిల్స్ పోలీసు స్టేషన్లో కేసు నమోదు అయినట్లు పోలీసులు తెలిపారు. ఈ కేసు విచారణకు రావాలని గతంలో మూడు పర్యాయాలు నోటీసులు జారీ చేశామని,దానికి ఆయన స్పందించలేదని పేర్కొన్నారు. మరోసారి నోటీసులు ఇచ్చేందుకు ఇం టికి వెళ్లగా ఆయన స్పందించలేదని, విచారణకు రాకపోవడంతోనే అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచినట్లు పోలీసులు తెలిపారు.

# తెలుగు సినీ పరిశ్రమకు బ్రాండ్ క్రియేట్ చేయాలి







(మొదటి పేజీ తరువాయి)

హైదరాబాద్ కు రెండు గంటలల్లో రావొచ్చు. తెలంగాణలోని ఎకో టూరిజం, టెంపుల్ టూరిజాన్ని ప్రమోట్ చేయండి. పరిశ్రమను నెక్స్ట్ లెవల్‌కు తీసుకెళ్లడమే మా ఉద్దేశం. గంజాయి, డ్రగ్స్‌తో పాటు సామాజిక అంశాలపైన సినిమా పరిశ్రమ ప్రచారం చేయాలి.

గతంలో సినిమా పరిశ్రమకు ఏది చేసినా కాంగ్రెస్ ప్రభుత్వాలే చేశాయి. సినిమా స్టూడియోలకు స్థలాలు, నిర్మాణాలు, నివాస స్థలాలు, ఫిల్మ్ నగర్, చిత్రపురి కాలనీ, కార్మికులకు ఇండ్లు, ఇతర సౌకర్యాలు కాంగ్రెస్ ప్రభుత్వాలే ఇచ్చాయి. ఆ వారసత్వాన్ని కొనసాగిస్తాం. సినిమా పరిశ్రమను ప్రోత్సాహించడమే మా ముఖ్య ఉద్దేశం. ముఖ్యమంత్రిగా చట్టాన్ని అమలు చేయాల్సిన బాధ్యత నాపై ఉంటుంది. నాకు వ్యక్తిగత ఇష్టాయిష్టాలు లేవు. తెలుగు సినిమా పరిశ్రమ తెలుగుకే పరిమితం కాకుండా అన్ని భాషల సినిమాల నిర్మాణానికి అంతా కలిసి అభివృద్ధి చేద్దాం. మా ప్రభుత్వం సినిమా పరిశ్రమకు ఎల్లప్పుడు అండగా ఉంటుంది. సినిమా పరిశ్రమ కూడా తమ సామాజిక బాధ్యతను గుర్తు పెట్టుకోవాలి. ప్రభుత్వ కార్యక్రమాల్లో, రాష్ట్ర అభివృద్ధిలో భాగస్వామ్యం కావాలి.

ఈ సందర్భంగా ప్రభుత్వం నుంచి వివిధ ప్రతిపాదనలు సినీ పరిశ్రమ ప్రతినిధుల ముందు రేవంత్ ఉంచారు. యాంటీ డ్రగ్స్ క్యాంపెయిన్‌కు సహకరించాలని కోరారు. ఈ ప్రచార కార్యక్రమాల్లో సినిమా హీరో. హీరోయిన్లు పాల్గొనాలని ప్రతిపాధించారు..ఇక కొత్తగా విధించే టికెట్ల ధరలపై విధించే సెస్‌ను ఇంటిగ్రేటెడ్ స్కూల్స్‌కి వినియోగిస్తామని పేర్కొన్నారు.. . ఇక నుంచి సినిమా హీరోలు, హీరోయిన్స్ తోపాటు.. సినీ ఇండస్ట్రీలోని వారు తమ భద్రత విషయంలో తీసుకుని బౌన్సర్లపైనా సీరియస్ గా ఉంటామని.. అభిమానులను కంట్రోల్ చేయాల్సిన బాధ్యత సెలబ్రిటీలదే అని తేల్చేశారు సీఎం రేవంత్.

**సినీ ఇండస్ట్రీ పెద్దలకు కొన్ని సూచనలు**

తెలంగాణ రాష్ట్ర అభివృద్ధిలో.. తెలంగాణ రైజింగ్ లో సినీ ఇండస్ట్రీకి సోషల్ రెస్పాన్సిబులిటీ ఉండాలని.. డ్రగ్స్ కు వ్యతిరేకంగా క్యాంపెయిన్ చేయాలని సూచించారు. మహిళా భద్రత క్యాంపెయిన్ విషయంలో చొరవ తీసుకోవాలని సలహా ఇచ్చారు సీఎం రేవంత్ రెడ్డి. ఇక తెలంగాణ రాష్ట్రంలోని టెంపుల్ టూరిజం, ఏకో టూరిజంలను ప్రమోట్ చేయాలని.. తెలంగాణ రాష్ట్రానికి వచ్చే పెట్టుబడుల విషయంలోనూ ఇండస్ట్రీ నుంచి సహకారం కావాలని సూచించారు సీఎం .తెలుగు సినిమా ఇండస్ట్రీకి ప్రభుత్వం నుంచి భరోసా ఉంటుందని.. అన్ని సమ స్యలను పరిష్కరిస్తామని.. ఎవరికీ ఎలాంటి ఆందోళనలు వద్దని స్పష్టం చేశారు. ఇదే సమయంలోనే ప్రభుత్వం తరపున సామాజిక కోణంలో సహకరించాలని సూచించారు సీఎం రేవంత్ రెడ్డి. ఈ సమావేశంలో తెలంగాణ ఫిల్మ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ దిల్ రాజు హెూం శాఖ ముఖ్య కార్యదర్శి రవి గుప్తా గారు, డీజీపీ జితేందర్ , సినీ రంగానికి నిర్మాతలు, దర్శకులు, నటులు పాల్గొన్నారు.



**టాలీవుడ్ సమస్యలను వివరించేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో సినీ ప్రముఖులు సమావేశమైన సంగతి తెలిసిందే. ఈ సమావేశంలో ముఖ్యమంత్రి ముందు సినీ పెద్దలు కొన్ని ప్రతిపాదనలు ఉంచారు.**

హీరో అక్కినేని నాగార్జున మాట్లాడుతూ ప్రభుత్వం క్యాపిటల్ ఇన్సెంటివ్ ఇస్తే... తెలుగు సినీ పరిశ్రమ గ్లోబల్ స్థాయికి ఎదుగుతుందని ప్రతిపాదించారు. హైదరాబాద్ వరల్డ్ సినిమా కేపిటల్ కావాలనేది తమ కోరిక అని అన్నారు. ఇంటర్నేషనల్ ఫిల్మ్ డెస్టినేషన్ గా హైదరాబాద్ ఉండాలని చెప్పారు. యూనివర్సల్ లెవెల్ లో స్టూడియో సెటప్ ఉండాలని అన్నారు.

నిర్మాత దగ్గుబాటి సురేశ్ బాబు మాట్లాడుతూ... గత ప్రభుత్వాల మద్దతుతో సినీ పరిశ్రమ మద్రాస్ నుంచి హైదరాబాద్ కు వచ్చిందని చెప్పారు. ప్రస్తుత ప్రభుత్వంపై నమ్మకముందని తెలిపారు. అమెజాన్, నెట్ ఫ్లిక్స్ సహా అన్ని ఏజెన్సీలకు హైదరాబాద్ కేపిటల్ కావాలని ఆకాంక్షించారు.

200ల సినిమాలు తీస్తే అందులో 100 సినిమాలు మాత్రమే రిలీజ్ అవుతున్నాయని ప్రశాంత్ వర్మ అన్నారు. అందులో ఒకటో, రెండో హిట్ అవుతున్నాయని.. సినిమా సక్సెస్ రేటు 1 శాతం మాత్రమే ఉందని ప్రశాంత్ వర్మ అన్నారు.

ప్రభుత్వాన్ని కలిసే అవకాశం ఇచ్చినందుకు ధన్యవాదాలు తెలిపారు అల్లు అరవింద్. సంధ్య థియేటర్ లాంటి ఘటనలు మళ్లీ జరగకుండా ఉండేదుకు ప్రయత్నిస్తాం అన్నారు అరవింద్. హైదరాబాద్ షూటింగ్ లకు బెస్ట్ స్పాట్ ని ముంబై వాళ్ళు ఎప్పుడూ చెప్తుంటారని అన్నారు. ముంబైతో పోల్చితే ట్రాఫిక్ తక్కువగా ఉండటం మనకు ప్లస్ పాయింట్. తెలుగు నిర్మాతలకు ఈ రోజు శుభదినం అని అల్లు అరవింద్ అన్నారు.

అందరు సీఎంలు ఇండస్ట్రీని బాగానే చూసుకున్నారని రాఘవేంద్రరావు అన్నారు. ఈ ప్రభుత్వం కూడా మమ్మల్ని బాగా చూసుకుంటోంది. దిల్ రాజును ఎఫ్‌డీసీ చైర్మన్‌గా నియమించడాన్ని స్వాగతిస్తున్నా.. తెలంగాణ అద్భుతమైన టూరిస్ట్ స్పాట్‌లు ఉన్నాయని రాఘవేంద్రరావు అన్నారు. అలాగే గతంలో చంద్రబాబు చిల్డ్రన్స్ ఫిల్మ్ ఫెస్టివల్ హైదరాబాద్‌లో చేశారు.. ఇప్పుడు కూడా ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్‌ను హైదరాబాద్‌లో నిర్వహించాలని కోరుతున్నాం అన్నారు రాఘవేంద్రరావు

చిన్నప్పటి నుంచి ఇండస్ట్రీలోనే ఉన్నా.. హైదరాబాద్ ను నెక్స్ట్ లీలావ్ లో ఉండాలి అని శ్యామ్ ప్రసాద్ రెడ్డి అన్నారు.

సంక్రాంతి నాటికి

## మొదటి విడతగా 4.50 లక్షల ఇందిరమ్మ ఇండ్లు

(మొదటి పేజీ తరువాయి)

స్పష్టం చేశారు. ఇందిరమ్మ ఇండ్ల నిరంతర ప్రక్రియ అని, ప్రతి సంవత్సరం ఇందిరమ్మ ఇండ్లను అర్హులకు అందిస్తామని అన్నారు.రాష్ట్రంలో ఉన్న జర్నలిస్టులను ఆదుకుంటామని పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. జర్నలిస్టులు పైకి మంచిగానే కనపడుతున్నప్పటికీ, వారికి ఎన్నో ఇబ్బందులు ఉన్నాయని, ఇందిరమ్మ ఇండ్ల కోసం దరఖాస్తు చేసుకున్న జర్నలిస్టులకు మొదటి విడతలోనే వచ్చే విధంగా చూస్తానని హామీ ఇచ్చారు.

ప్రతి నియోజకవర్గంలో మొదటి విడతగా 3500 ఇందిరమ్మ ఇండ్లు అందిస్తామని అన్నారని తెలిపారు. అశ్వారావుపేట నియోజకవర్గంలో ఎక్కువగా ఏజెన్సీ ప్రాంతం ఎక్కువగా ఉండటంతో, ఇక్కడ ఎంతోమంది నిరుపేదలు ఉన్నారని, అశ్వారావుపేట నియోజకవర్గానికి ఎక్కువ ఇందిరమ్మ ఇండ్లు కేటాయించాలని ఎంఎల్ఏ జారె ఆదినారాయణ మంత్రిని కోరారు. మంత్రి స్పందిస్తూ ఏజెన్సీ ప్రాంతాల్లో ప్రజలకు ఎక్కువ ఇందిరమ్మ ఇండ్లు అందించే విధంగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వేణుగోపాల్, ఇన్‌ఛార్జి ఆర్‌డిఓ కాషయ్య, దమ్మపేట మార్కెట్ కమిటీ ఛైర్మన్ వాసం రాణి తదితరులు పాల్గొన్నారు.

## మాజీ ప్రధాని మన్మోహన్ కన్నుమూత

(మొదటి పేజీ తరువాయి)

రైట్ ప్రైజ్ (1955) ఉన్నాయి.అలాగే, పలు దేశాలు అత్యున్నత పురస్కారాలు కూడా అందుకున్నారు.డాక్టర్ మన్మోహన్ సింగ్ ప్రపంచవ్యాప్తంగా అనేక అంతర్జాతీయ సమావేశాలలో, అంతర్జాతీయ సంస్థలలో భారతదేశాన్ని ప్రాతినిధ్యం వహించారు.

1993లో అంగీకరించిన కామన్వెల్త్ హెడ్స్ ఆఫ్ గవర్నమెంట్ మీటింగ్ (సైప్రస్), 1993లో వియన్నాలో జరిగిన ప్రపంచ హ్యూమన్ రైట్స్ కాన్ఫరెన్స్‌కు ఆయన నాయకత్వం వహించారు.పొలిటికల్ కెరీర్ లో డాక్టర్ మన్మోహన్ సింగ్ 1991 నుంచి రాజ్యసభ సభ్యుడిగా కొనసాగుతున్నారు. 1998 నుండి 2004 వరకు ఆయన రాజ్యసభలో ప్రతిపక్ష నేతగా పనిచేశారు. 2004 జనవరి ఎన్నికల తరువాత డాక్టర్ మన్మోహన్ సింగ్ 22 మే 2004న ప్రధాని పదవిని స్వీకరించారు. 2009 మే 22న రెండవసారి ప్రమాణం చేశారు.సింగ్ కన్నుమూత

## ఎస్ఐ, మహిళా కానిస్టేబుల్, సింగిల్ విండో జూనియర్ అసిస్టెంట్ ఆత్మహత్య

(మొదటి పేజీ తరువాయి)

జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న కిరణ్ కుమార్ మృతి చెందారు. పోస్టుమార్టం రిపోర్టు ఆధారంగానే వివరాలు వెల్లడిస్తామని జిల్లా ఎస్‌పి సింధుశర్మ వెల్లడించడంతో ముగ్గురి ఆత్మహత్య సంఘటనపై చిక్కుముడి వీడలేదు. వివరాల్లోకి వెళ్తే.. మెదక్ జిల్లా, కొల్చారంనకు చెందిన ఆంజయ్య, శంకరమ్మకు ఇద్దరు సంతానం, కాగా మొదటి సంతానం సాయికుమార్, వ్యవసాయ కుటుంబానికి చెందిన సాయికుమార్ బీటెక్ చేసిన అనంతరం 2018లో మూడు ప్రభుత్వ ఉద్యోగాలకు ఎంపికయ్యాడు. పోస్టల్ డిపార్ట్‌మెంట్‌లో ఉన్నతాధికారి ఉద్యోగంతో పాటు స్పెషల్ పార్టీ కానిస్టేబుల్‌తో పాటు ఎస్ఐ జాబ్‌ను జనరల్ కేటగిరిలో పొందాడు. మూడు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించిన సాయికుమార్‌కు ఆర్థిక ఇబ్బందులు ఏమీలేవు. అయితే మహాలక్ష్మి అనే యువతిని పెండ్లాడిన సాయికుమార్‌కు మూడేళ్ల వయసు గల కుమారుడు శ్రేయన్ ఉండగా ప్రస్తుతం అతని భార్య గర్భవతితో ఉంది. బుధవారం ఉదయం 11:30 గంటలకు విధులు నిర్వహిస్తున్న సాయికుమార్ అత్యవసర పని ఉందని ఇంటికి వెళ్లి సాయంత్రం లోగా వస్తానని చెప్పాడు. అప్పటి నుంచి అతని ఫోన్ స్విచ్ ఆఫ్ రావడంతో ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు పోలీసు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. అడ్లూర్ ఎల్లారెడ్డి గ్రామ ప్రాంతంలో ఎస్ఐ సాయికుమార్ ఉన్నట్లు పోలీసులు గుర్తించారు.

ఇదిలావుండగా బీబీపేటలో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న శృతిది గాంధారి మండలం, గుర్జాల్ గ్రామం. ఆమె తండ్రి కమ్మరి పుండరీకం, తల్లి విజయతో పాటు చెల్లలు శ్వేత, తమ్ముడు నవీన్‌తో కలిసి గాంధారిలో గత ఆరేళ్ల నుంచి నివాసం ఉంటోంది.. శృతికి గత ఐదు సంవత్సరాల క్రితం పెండ్లి కాగా విడాకులు తీసుకుంది. ఆమె పోలీస్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిసూ గాంధారికి వెళ్తి వస్తుండేది. మంగళవారం డ్యూటీకి వచ్చిన శృతి బుధవారం ఇంటికి వెళ్లకపోవడంతో కుటుంబ సభ్యులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

కామారెడ్డి జిల్లాలోని వడ్లూరు చెరువు ప్రాంతంలో గల పెద్ద చెరువు వద్ద ఎస్సై సాయికుమార్ కారు చెప్పులు కనిపించడంతో పలువురికి అనుమానం వచ్చి పోలీసులకు సమాచారం అందించారు.వెంటనే పోలీసులు అక్కడికి వెళ్లి పరిశీలించగా బిక్కనూర్ ఎస్సై సాయికుమార్ కు చెందిన కారుగా గుర్తించారు. ముగ్గురు ఆత్మహత్యలపై పోలీసులు పలుకోనాలలో విచారణ జరుగుతున్నారు.

## ఏడో గ్యారెంటీగా ఎమర్జెన్సీని అమలుచేస్తున్న ముఖ్యమంత్రి

- **ఎర్రోళ్ల శ్రీనివాస్‌ను అరెస్టు దుర్మార్గం**
- **బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్**

బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో

బీఆర్ఎస్ సీనియర్ నేత, ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్‌గా పనిచేసిన ఎర్రోళ్ల శ్రీనివాస్‌ను అక్రమంగా అరెస్టుచేయడం దుర్మార్గమైన చర్య అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. ఎన్నికల ప్రచారంలో దళిత, బహుజన వర్గాలకు కాంగ్రెస్ ఇచ్చిన హామీల అమలు కోసం బీఆర్ఎస్ తరఫున ప్రశ్నిస్తున్నందుకే ఎర్రోళ్లపై కక్షగట్టి అక్రమ కేసులతో వేధించాలని చూస్తున్నారు. కనీసం నోటీసు కూడా ఇవ్వకుండా తెల్లవారుజామున ఎర్రోళ్ల ఇంటికి వెళ్లి వారి కుటుంబసభ్యులను భయభ్రాంతులకు గురిచేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నాం. ఇందిరమ్మ రాజ్యంలో ఆరు గ్యారెంటీలను అటకెక్కించి, ఏడో గ్యారెంటీగా ఎమర్జెన్సీని ముఖ్యమంత్రి అమలుచేస్తున్నారు. ప్రజల్లో వెల్లువెత్తుతున్న వ్యతిరేకతను తట్టుకోలేక.. నిర్బంధం, అణచివేతతో బీఆర్ఎస్ గొంతునొక్కే విఫల యత్నం చేస్తున్నారు. రోజురోజుకూ పెరిగిపోతున్న నేరాల నియంత్రణలో పూర్తిగా చేతిలెత్తేసి, ప్రధాన ప్రతిపక్షాన్ని ఎలా నియంత్రించాలనే దానిపైనే సర్వశక్తులు ఒడ్డుతున్నారు. అక్రమంగా అరెస్టుచేసిన ఎర్రోళ్ళ శ్రీనివాస్ ను వెంటనే విడుదల చేయాలి. తప్పుడు కేసులతో రాజకీయ ప్రత్యర్థులను భయపెట్టాలని చూసే విష సంస్కృతికి చరమగీతం పాడాలి. బీఆర్ఎస్ పార్టీకి కేసులు కొత్తకాదు, అరెస్టులు అంత కన్నా కాదు.. ఆత్మగౌరవ పోరాటాలతో సాధించుకున్న తెలంగాణలో ఇలాంటి బెదిరింపు చర్యలకు భయపడే వారెవరూ లేరంటూ కేటీఆర్ ట్వీట్ చేశారు.

## దున్నేవాడికే భూమి అనే సిద్ధాంతాల కోసం సీపీఐ పోరాటం

**సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడా వెంకట్‌రెడ్డి, పార్టీ జాతీయ సమితి సభ్యులు పల్లా వెంకటరెడ్డి**

**సీపీఐ శతాబ్ది ఉత్సవాల బహిరంగ సభలో**

బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో




సోషలిస్టు సమాజం, పీడిత వర్గాల అభ్యున్నతి, సమ సమాజ నిర్మాణం కోసం 1925, డిసెంబర్ 26న ఉత్తరప్రదేశ్ కాన్పూర్ పట్టణంలో కొద్ది మందితో ఏర్పడ్డ వామ పక్ష ఎర్రజెండా పార్టీ భారత కమ్యూనిస్టు పార్టీ నేటికీ వంద వసంతాల ఉత్సవాలు జరుపుకుంటుందని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు, మాజీ రాష్ట్ర కార్యదర్శి చాడా వెంకట్‌రెడ్డి, పార్టీ జాతీయ సమితి సభ్యులు పల్లా వెంకటరెడ్డి అన్నారు. తెలిపారు. సీపీఐ శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్ మెట్ మండలం పెద్ద అంబర్ పేటలో సీపీఐ మండల కమిటీ ఆధ్వర్యంలో భారీ బహిరంగ సభ నిర్వహించారు. సభాధ్యక్షులుగా ముత్యాల యాదిరెడ్డి, పబ్బతి లక్ష్మణ్ వ్యవరించారు. ముఖ్య అతిథిగా హాజరైన చాడా వెంకటరెడ్డి, మాట్లా డుతూ నిజాం పాలనకు వ్యతిరేకంగా తెలంగాణలో భూమి, భుక్తి, వెట్టిచాకిరి విముక్తి కోసం సుమారు 4,500 మంది కమ్యూనిస్టు నాయకులు ఆత్మబలి దానాలు చేసి సుమారు పది లక్షల వేల ఎకరాల భూమిని పంచిన చరిత్ర కమ్యూనిస్టు పార్టీదన్నారు. ఘనమైన చరిత్ర కలిగిన సంఘటన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటమని గుర్తు చేశారు. రాష్ట్ర రాజధాని హైదరాబాద్ చుట్టూర ప్రాంతంలో ఉన్న అన్ని పేదల బస్తీలు కమ్యూనిస్టు పార్టీల పోరాటల ద్వారానే వెలిశాయన్నారు. పేదవాడికి, కార్మికునికి, కర్షకునికి ఏ కష్టం వచ్చినా సీపీఐ అండగా ఉంటుందన్నారు. అధికారం ఉన్నా, లేకున్నా ప్రజల సంక్షేమ కోసం సీపీఐ పనిచేస్తుందని తెలిపారు. అమరవీరుల ఆశయ సాధనలో నిరంతరం పయనిస్తూ ఏనాటికో ఓ నాటికి పార్లమెంట్‌పైన సీపీఐ జెండా ఎగరేస్తామన్నారు.



## ఆగి ఉన్న లారీ ఢీకొన్న కారు..

- ఒకరు మృతి.. ముగ్గురికి గాయాలు..
- రాజన్న దర్శనం కోసం వచ్చి.. తిరిగి వెళుతుండగా ఘటన.

**బలగం టీవీ, బోయిని పల్లి**

దైవ దర్శనానికి వెళ్లి తిరిగి ఇంటికి వెళ్లి వస్తుండగా ఆగి ఉన్న లారీని కారు ఢీకొనడంతో ఒకరు మృతి చెందగా, మరో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన రాజన్న సిరిసిల్ల జిల్లా బోయిని పల్లి మండలం వెంకట్రావుపల్లి లోని కామారెడ్డి కరీంనగర్ ప్రధాన రహదారిపై గురువారం జరిగింది. కరీంనగర్ లోని ఎల్ఎండి కాలనీకి చెందిన మాశెట్టి అశోక్, మాశెట్టి ఆద్య, పోలవేణి గట్టు బాబులు పోలవేణి మంగ లు వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామిని దర్శించుకొని కారు లో గురువారం ఉదయం తిరిగి కరీంనగర్ వెళుతుండగా బోయిని పల్లి మండలంలోని వెంకట్రావు పల్లి లో ఆగి ఉన్న లారీని వారు ప్రయాణిస్తున్న వెనుక నుండి ఢీకొనడంతో పోలవేణి మంగ(50)అక్కడికక్కడే మృతి చెందగా,మరో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. వారి పరిస్థితి విషమంగా ఉండడంతో 108 వాహనంలో కరీంనగర్ లోని ఆసుపత్రికి తరలించారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పృథ్వీధర్ గౌడ్ తెలిపారు.



## మాంసాహార ప్యాకెట్లు పంచిన వారిపై చర్యలు తీసుకోండి

- రాజన్న ఆలయ ఈవో వినోద్ రెడ్డి
- పట్టణ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు
- రాజన్న ఆలయ సన్నిధిలో సంప్రోక్షణ కార్యక్రమం

**బలగం టీవీ , వేములవాడ**

వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి వారి ఆలయ సన్నిధిలో బుధవారం సాయంత్రం కొంతమంది వ్యక్తులు మాంసాహారంతో కూడిన భోజన ప్యాకెట్లను అందజేయడంపై బాధ్యులైన వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని పట్టణ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసినట్లు ఆలయ ఈవో వినోద్ రెడ్డి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. అంతేకాకుండా హిందూ మతానికి చెందిన భక్తుల మనోభావాలకు భంగం వాటిల్లడం పట్ల రాజన్న ఆలయ సన్నిది తో పాటు గుడి చెరువు పరిసరాలు, ఆలయ పశ్చిమ వైపున ఆలయ అర్చక బృందం ఆధ్వర్యంలో పుణ్య వచన, సంప్రోక్షణ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు.

## సంధ్య థియేటర్ ఘటనను ప్రభుత్వం రాజకీయం చేస్తోంది

- సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు

**బలగం టీవీ , హైదరాబాద్**



సంధ్యా థియేటర్ ఘటనలో గాయపడి కిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న శ్రీతేజ్‌ను మాజీమంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు పరామర్శించారు. గురువారం మధ్యాహ్నం కిమ్స్ హాస్పటల్ కు వెళ్లిన ఆయన వైద్యులను శ్రీతేజ్ ఆరోగ్య పరిస్థితి గురించి అడిగి తెలుసుకున్నారు.. అలాగే శ్రీతేజ్ తండ్రి భాస్కర్‌ను పలుకరించి, ధైర్యంగా ఉండాలని సూచించారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ.. శ్రీతేజ్‌కు మెరుగైన వైద్యం అందిస్తున్నామని కిమ్స్ వైద్యులు చెప్పారన్నారు. శ్రీతేజ్ త్వరగా కోలుకోవాలని ఆ భవగవంతుడిని ప్రార్థిస్తునట్లు చెప్పారు. సినిమా వాళ్లను భయపెట్టి సీఎం రేవంత్ మంచి చేసుకోకూడదని హితవు పలికారు.. ఈ ఘటనను ప్రభుత్వం రాజకీయం చేస్తోందని ఆరోపించారు. . గురుకులాల్లో మృతి చెందిన పిల్లల కుటుంబ సభ్యులను ఇంత వరకు ఎందుకు పరామర్శించలేదని సీఎం రేవంత్‌ను ప్రశ్నించారు. ఓ సర్పంచ్ ఆత్మహత్యకు కారకుడైన మీ సోదరుడిని ఎందుకు అరెస్టు చేయలేదని నిలదీశారు. చట్టం అనేది అందరికీ సమానంగా ఉండాలన్నారు.. శ్రీతేజ్‌ను పరామర్శించిన వారిలో కేపీ వివేకానంద, బండారు లక్ష్మారెడ్డి, ఎర్రబెల్లి దయాకర్ రావు, శ్రీనివాస్ గౌడ్, నవీన్ కుమార్‌తో పాటు పలువురు నాయకులు ఉన్నారు.

### పీఎఫ్ కలిగిన

## బీడీ కార్మికులందరికీ రూ. 4000 జీవన భృతి ఇవ్వాలి

- బీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు వెంగళ శ్రీనివాస్



**బలగం టీవీ, సిరిసిల్ల**

పీఎఫ్ కలిగిన బీడీ కార్మికులందరికీ 4000 రూపాయల జీవన భృతి ఇవ్వాలని బిఆర్టియు జిల్లా అధ్యక్షుడు వెంగళ శ్రీనివాస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం సిరిసిల్ల పట్టణంలోని పలు బీడి కంపెనీలను బిఆర్టియు జిల్లా అధ్యక్షుడు వెంగళ శ్రీనివాస్ సందర్శించి నారు.ఈ సందర్భంగా భారత రాష్ట్ర ట్రేడ్ యూనియన్ జిల్లా అధ్యక్షులు వెంగళ శ్రీనివాస్ మాట్లాడుతూ వ్యవసాయ రంగం తర్వాత అతిపెద్ద పరిశ్రమ బీడీ పరిశ్రమ అని, దాదాపు తెలంగాణ రాష్ట్రంలో ఈ పరిశ్రమపై 8 లక్షల మంది బీడీ కార్మికులు ఆధారపడి జీవిస్తున్నారని అన్నారు. బీడీలు చుడితేనే పూట గడిచే పరిస్థితి ఉన్నదని, గ్రామీణ స్థాయి నుంచి పట్టణాల వరకు ఈ పరిశ్రమపై పెద్ద ఎత్తున మహిళలు ఆధారపడి బతుకుతున్నారని అన్నారు. ఈ పరిశ్రమను కాపాడాల్సిన కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు మాత్రం నిర్వీర్యం చేసే పద్ధతుల్లో అనేక ఆంక్షలు విధిస్తూ బీడీ కార్మికుల ఉపాధిని దెబ్బతిస్తున్నాయని అన్నారు. గత ప్రభుత్వం బీడీ కార్మికుల స్థితిగతులు తెలుసుకొని దేశంలో ఎక్కడలేని విధంగా 2016 రూపాయల జీవన భృతి ఇచ్చి ఆదుకున్న ఘనత కేసిఆర్ దేనని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాకముందు బీడీ కార్మికులకు 4000 రూపాయల జీవనభృతి పెంచి ఇచ్చి ఆదుకుంటామని అనేక హామీలు ఇచ్చి తీరా అధికారంలోకి వచ్చి సంవత్సరము దాటిన ఈ హామీని నెరవేర్చకపోవడం బాధాకరమన్నారు. బీడీ కార్మికుల స్థితిగతులు తెలుసుకొని ఈ బీడీ పరిశ్రమను కాపాడి ఎలాంటి ఆంక్షలు లేకుండా పిఎఫ్ కలిగిన కార్మికులందరికీ 4000 రూపాయలు ఆసరా పెన్షన్ ఇవ్వాలని జీవిత బీమా మరియు ఈఎస్ఐ సౌకర్యం కల్పించి ఆర్థికంగా ఆదుకోవాలని అన్నారు.

## ముసురేసిన హైదరాబాద్

- పలు ప్రాంతాల్లో వర్షం
- చలితో వణికిన ప్రజలు

**బలగం టీవీ , హైదరాబాద్**



అల్పపీడనం ప్రభావంతో హైదరాబాద్‌తోపాటు తెలంగాణ వ్యాప్తంగా వాతావరణం చల్లబడింది. హైదరాబాద్ నగరంలో గురువారం ఉదయం నుంచి ముసురేసింది.దాంతో నగర వ్యాప్తంగా చలి తీవ్రత పెరిగింది. అలాగే నగరంలోని చాలా ప్రాంతాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షం కురిసింది. దాంతో ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

హయత్ నగర్, దిల్‌సుఖ్‌నగర్, ఎల్‌బీనగర్, నాగోల్, ఉప్పల్, రామంతపూర్ హబ్సిగూడ, తార్నాక, సికింద్రాబాద్, రాంనగర్, ఆర్టీసీ క్రాస్ రోడ్స్, వీఎస్టీ, ట్యాంక్ బండ్, ఖైరతాబాద్, బంజారాహిల్స్, సోమాజిగూడ, పంజాగుట్ట, లక్డీకాపూల్, మెహిదీపట్నం తదితర ప్రాంతాల్లో వర్షం కురిసింది.

బంగాళాఖాతంలో ఏర్పడిన ఉపరితల ఆవర్తనం ప్రభావం తెలంగాణ రాష్ట్రంపైనా కనిపిస్తోంది. ఉత్తర, ఈశాన్య గాలుల ప్రభావంతో రాష్ట్రంలో వర్షాలు కురుస్తున్నాయని హైదరాబాద్ వాతావరణ శాఖ తెలిపింది. శుక్రవారం తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయని పేర్కొంది.

ఇది ఇలావుండగా, బంగాళాఖాతంలో తీవ్ర అల్పపీడనం క్రమంగా బలహీనపడుతోందని విశాఖపట్నం వాతావరణ శాఖ తెలిపింది. అల్పపీడనం బలహీనంగా మారిందని పేర్కొంది. దీని ప్రభావంతో 1.5 కిలో మీటర్ల మేర ఉపరితల ఆవర్తనం ఏర్పడినట్లు తెలిపింది. అల్పపీడన ప్రభావంతో తీరం వెంబడి గంటకు 65 కి.మీ. వేగంతో బలమైన గాలులు వీచే అవకాశం ఉందని పేర్కొంది. ఇప్పటికే ఏపీలోని అన్ని పోర్టుల వద్ద మూడో ప్రమాద హెచ్చరిక జారీ చేశారు. మత్స్యకారులు వేటకు వెళ్లొద్దని సూచించింది. వచ్చే 24 గంటల్లో పలు ప్రాంతాల్లో భారీ వర్షం కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ పేర్కొంది

## బీజేపీకి ఒక్క ఏడాదిలోనే రూ.2 వేల కోట్లకు పైగా విరాళాలు

**బలగం టీవీ , న్యూఢిల్లీ**

పార్టీ ఫండ్ సేకరణలో బీజేపీ తొలి స్థానంలో నిలిచింది.. ఈ పార్టీ దరిదాపులలో కూడా ఇటు జాతీయ పార్టీలు, ప్రాంతీయ పార్టీలు లేకపోవడం గమనార్హం. ఈ పార్టీ విరాళాల రూపంలో 2023-24లో ఏకంగా రూ. 2వేల 244 కోట్లు పొందింది. ఇక ప్రతిపక్ష పార్టీ, దేశంలో రెండో అతిపెద్ద పార్టీ కాంగ్రెస్ కు కేవలం రూ. 288.9 కోట్లు మాత్రమే వచ్చాయి. ప్రుడెంట్ ఎలక్టోకరల్ అధికంగా విరాళాలు ఇచ్చిన దాతగా ఉంది. నిబంధనల ప్రకారం ఎలక్టోరల్ బాండ్ రషీదులు మినహాయించబడ్డాయి. 2023-24లో వ్యక్తులు, ట్రస్టులు , కార్పొరేట్ సంస్థలు నుంచి రూ. 20వేలు అం తకంటే ఎక్కువ విరాళాల రూపంలో బీజేపీకి దాదాపు రూ. 2వేల 244కోట్లు వచ్చాయి. ఇది 2022-23తోలో వచ్చిన విరాళాల కంటే మూడు రెట్లు ఎక్కువ. మరోవైపు కాంగ్రెస్ కు 2023-24లో రూ. 288.9 కోట్ల విరాళాలు వచ్చాయి. గతేడాది కాంగ్రెస్ కు కేవలం 79.9కోట్లు మాత్రమే వచ్చాయి. 2023-24 లో రెండు పార్టీలకు వచ్చిన విరాళాల వివరాల రిపోర్టులను ఎలక్షన్ కమిషన్ వెబ్ సైట్ లో ఉంచింది. ఫ్రూడెంట్ ఎలక్టోర్ ట్రస్ట్ నుంచి బీజేపీ రూ. 723.60కోట్ల విరాళాలు అందుకుంది. అదే కంపెనీ కాంగ్రెస్ కు రూ.156.4కోట్లు అందించింది. రెండు పార్టీలకు అత్యధిక విరాళాలు ఈ సంస్థ నుంచే వచ్చాయి. బీజేపీకి మూడింట ఒకవంతు, కాంగ్రెస్ కు సగానికి పైగా ఈ సంస్థనుంచే విరాళాలు అందాయి. కొన్ని ప్రాంతీయ పార్టీలు తమ 2023-24 కంట్రిబ్యూషన్ రిపోర్టులలో పార్టీ విరాళాలను ప్రకటించాయి. వీటిలో బిఆర్ఎస్ 495.5 కోట్లు, డీఎంకే 60 కోట్లు, వైఎస్ఆర్ కాంగ్రెస్ రూ.121.5 కోట్లు, జెఎంఎం రూ. 11.5 కోట్లుపొందినట్లు ప్రకటించాయి.

# భారీ స్కోర్ దిశగా ఆస్ట్రేలియా

- ఆటముగిసే సమయానికి ఆస్ట్రేలియా స్కోరు 311/6
- అదరగొట్టిన ఆరంగ్రేట కుర్రాడు
- 3 వికెట్లు తీసిన జస్ప్రీత్ బుమ్రా



**బలగం టీవీ, మెల్‌బోర్న్**

మెల్‌బోర్న్‌లో జరుగుతున్న బాక్సింగ్ డే టెసు తొలి రోజు ఆస్ట్రేలియా ఆట ముగిసే సమయానికి 86 ఓవర్లలో ఆరు వికెట్ల నష్టానికి 311 రన్స్ చేసి భారీ స్కోరు దిశగా ప్రయాణిస్తోంది. భారత బౌలర్లలో బుమ్రా మూడు వికెట్లు తీసుకోగా, ఆకాశ్, జడేజా, సుందర్ .. చెరో వికెట్ తీసుకున్నారు.

తొలుత టాస్ గెలిచిన ఆస్ట్రేలియా బ్యాటింగ్ ఎంచుకుంది. 19 ఏళ్ల యువ బ్యాటర్ సామ్ కొన్‌స్టాస్ మెల్‌బోర్న్ టెస్టులో అరంగేట్రం చేశాడు. ఇండియన్ పేస్ బౌలర్లలను అతను ధీటుగా ఎదుర్కొన్నాడు. కేరీర్‌లో ఫస్ట్ మ్యాచ్ ఆడుతున్నామనే బెరుకు లేకుండా విధ్వంసకర బ్యాటింగ్‌తో చెలరేగాడు. ముఖ్యంగా టీమిండియా స్టార్ పేసర్ జస్‌ప్రీత్ బుమ్రాను టార్గెట్ చేసిన సామ్ కోన్‌స్టాస్..అతనిపై బౌండరీలతో విరుచుకుపడ్డాడు. అతని ధాటికి మూడేళ్ల తర్వాత బుమ్రా టెస్ట్‌ల్లో సిక్స్ సమర్పించుకున్నాడు.

ఎన్నడూ లేని విధంగా తొలి 6 ఓవర్లలోనే 38 పరుగులు ఇచ్చుకున్నాడు. ఈ క్రమంలో సామ్ కోన్‌స్టాస్ 52 బంతుల్లో హాఫ్ సెంచరీ సాధించాడు. పేసర్లను అలవోకగా ఆడుతున్న సామ్ కోన్‌స్టాస్‌ను కట్టడి చేసేందుకు కెప్టెన్ రోహిత్ శర్మ స్పిన్నర్ రవీంద్ర జడేజాను బరిలోకి దించాడు. అతను అద్భుతమైన బంతితో కోన్‌స్టాస్‌ను ఎల్బీగా పెవిలియన్ చేర్చాడు. దాంతో తొలి వికెట్‌కు నమోదైన 89 పరుగుల భాగస్వామ్యానికి తెరపడింది. ఆ తర్వాత క్రీజులోకి వచ్చిన లబుషేన్‌తో కలిసి ఉస్మాన్ ఖవాజా ఆచితూచి ఆడాడు. దాంతో ఆస్ట్రేలియా 112/1 స్కోర్‌తో లంచ్ బ్రేక్ వెళ్లింది.

రెండో సెషన్ ఆరంభంలోనే ఉస్మాన్ ఖవాజా 101 బంతుల్లో హాఫ్ సెంచరీ పూర్తి చేసుకున్నాడు. రెండో వికెట్‌కు 65 పరుగుల భాగస్వామ్యం నమోదు చేసిన ఈ జోడీని జస్‌ప్రీత్ బుమ్రా విడదీసాడు. ఉస్మాన్ ఖవాజాను క్యాచ్ ఔట్‌గా పెవిలియన్ చేర్చాడు. క్రీజులోకి స్టీవ్ స్మిత్ రాగా.. లబుషేన్ అసలు సిసలు టెస్ట్ బ్యాటింగ్‌తో పరుగులు చేశాడు. దాంతో ఆస్ట్రేలియా 176/2 స్కోర్‌తో టీ బ్రేక్‌కు వెళ్లింది. మూడో సెషన్‌లో మరింత సాధికారికంగా ఆడిన ఈ జోడీ వేగంగా పరుగులు రాబట్టింది. లబుషేన్ 114 బంతుల్లో హాఫ్ సెంచరీ పూర్తి చేసుకోగా.. స్మిత్ 71 బంతుల్లో అర్ధ శతకం సాధించాడు. సెంచరీ దిశగా సాగిన లబుషేన్‌ను వాషింగ్టన్ సుందర్ క్యాచ్ ఔట్‌గా పెవిలియన్ చేర్చాడు. దాంతో మూడో వికెట్‌కు నమోదైన 83 పరుగుల భాగస్వామ్యానికి తెరపడింది. క్రీజులోకి వచ్చిన ట్రావిస్ హెడ్‌ను జస్‌ప్రీత్ బుమ్రా స్టన్నింగ్ డెలివరీతో క్లీన్ బౌల్డ్ చేశాడు. దాంతో అతను డకౌట్‌గా పెవిలియన్ చేరాడు. తన మరుసటి ఓవర్‌లోనే మిచెల్ మార్ష్(4)ను కీపర్ క్యాచ్‌గా పెవిలియన్ చేర్చాడు. ఈ క్రమంలోనే అలెక్స్ క్యారీతో కలిసి స్మిత్ ఇన్నింగ్స్‌ను ముందుకు నడిపించాడు. 6వ వికెట్‌కు 53 పరుగులు జోడించిన అనంతరం.. అలెక్స్ క్యారీ(31)ని ఆకాశ్ దీప్ కీపర్ క్యాచ్‌గా పెవిలియన్ చేర్చాడు. క్రీజులోకి ప్యాట్ కమిన్స్ రాగా.. మరో వికెట్ పడకుండా స్మిత్ జాగ్రత్తగా ఆడాడు.



## కోహ్లీకి మ్యాచ్ ఫీజులో 20 శాతం కోత

**బలగం టీవీ, మెల్‌బోర్న్**



మెల్‌బోర్న్‌లో ఆస్ట్రేలియాతో జరుగుతున్న నాలుగవ టెస్టులో.. యువ బ్యాటర్ సామ్ కొన్‌స్టాస్‌ను ..కోహ్లీ భుజంతో ఢీకొట్టాడు. క్రీజ్‌పై ఎదురెదురుగా నడుస్తున్న సమయంలో ఈ ఘటన చోటుచేసుకు న్నది. ఆ ఘటన పట్ల ఐసీసీ చర్యలు తీసుకున్నది. కోహ్లీకి మ్యాచ్ ఫీజులో 20 శాతం జరిమానా విధించింది. ఆస్ట్రేలియా ఇన్నింగ్స్ పదవ ఓవర్‌లో ఈ ఘటన జరిగింది. పిచ్‌పై ఎదురెదురుగా వెళ్తున్న సమయంలో.. కొన్‌స్టాస్ భుజాన్ని కోహ్లీ తాకాడు. ఆ తర్వాత ఇద్దరూ ఒకర్ని ఒకరు తిరిగి చూసుకున్నారు. కొన్ని మాటలు అనుకున్నారు. మరో బ్యాటర్ ఖవాజా వచ్చి ఆ గొడవను కూల్ చేసే ప్రయత్నం చేశాడు.ఇద్దరు ప్లేయర్లతో చర్చించిన ఆన్‌ఫీల్డ్ అంపైర్లు.. కోహ్లీపై లెవల్ 1 అభియోగాన్ని నమోదు చేశారు. ఆ నేరం కింద అతనికి మ్యాచ్ ఫీజులో 20 శాతం కోత విధించారు. కోహ్లీకి ఒక మ్యాచ్ నిషేధం విధించే అవకాశాలు ఉన్నట్లు తొలుత కొందరు మాజీ క్రికెటర్లు అంచనా వేశారు. లెవల్ 2 నేరం అయితే కోహ్లీ నాలుగు పాయింట్లు కోల్పోయేవాడు. దాని వల్ల అతను ఓ టెస్టు మ్యాచ్‌ను దూరం అయ్యే అవకాశాలు ఉండేవి. క్రికెట్‌లో ఎటువంటి భౌతికపరమైన దాడి .. ఐసీసీ నియమావళిని ఉల్లంఘించినట్లు అవుతుంది.

కోహ్లీ భుజం తాకిన ఘటనపై కొన్‌స్టాస్ స్పందించాడు. మ్యాచ్ ముగిసిన తర్వాత మాట్లాడుతూ.. అతనేమీ కావాలని భుజాన్ని ఢీకొట్టలేదన్నాడు. అకస్మాత్తుగా కోహ్లీ తనవైపు దూసుకొచ్చాడని, క్రికెట్‌లో ఇదంతా జరుగుతుందన్నాడు. ఇద్దరమూ భావోద్వేగానికి లోనైట్లు చెప్పాడు.

## తిరుచానూరు పద్మావతి అమ్మవారిని దర్శించుకున్న పీవీ సింధు దంపతులు

**బలగం టీవీ, హైదరాబాద్**

భారత స్టార్ బ్యాడ్మింటన్ ప్లేయర్ పీవీ సింధు తిరుపతిలోని తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారిని దర్శించుకున్నారు. ఇటీవలే సింధు వివాహం హైదరాబాద్‌కు చెందిన వెంకట దత్త సాయితో ఘనంగా జరిగిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో పెళ్లి తర్వాత కొత్త దంతులు అమ్మవారి ఆశీస్సుల కోసం తిరుపతికి వచ్చారు. కుటుంబ సభ్యులతో కలిసి సింధు–దత్త సాయి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. దర్శనానంతరం వేద పండితులు ఆశీర్వచనం చేశారు. అనంతరం అమ్మవారి చిత్రపటం, తీర్థప్రసాదాలు అందజేశారు. అమ్మవారిని దర్శించుకోవడం సంతోషంగా ఉందని.. పెళ్లి తర్వాత అమ్మ ఆశీస్సుల కోసం వచ్చినట్లు సింధు తెలిపారు.




## కాంబ్లీకి రూ. 5 లక్షల ఆర్థిక సాయం

**బలగం టీవీ, ముంబై**

మూత్రనాళాల సమస్యతో బాధపడుతూ భీవండిలోని ఓ దవాఖానలో చికిత్స పొందుతున్న భారత మాజీ క్రికెటర్ వినోద్ కాంబ్లీకి మహారాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి, ప్రస్తుత ఉప ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే కుమారుడు శ్రీకాంత్ షిండే రూ. 5 లక్షల ఆర్థిక సాయం ప్రకటించారు. కళ్యాణ్ లోక్‌సభ నుంచి ఎంపీగా ఉన్న ఆయన.. డాక్టర్ శ్రీకాంత్ షిండే ఫౌండేషన్ ద్వారా ఈ సాయం అందజేస్తామని తెలిపారు. కాగా యూరినరీ ఇన్‌ఫెక్షన్ తగ్గినప్పటికీ కాంబ్లీ జ్వరంతో బాధపడుతున్నాడు. మెదడులో రక్తం గడ్డ కట్టడంతో అతడి మెదడును స్కానింగ్ చేయాలని వైద్యులు భావించినప్పటికీ జ్వరం కారణంగా అది సాధ్యపడలేదని డాక్టర్ వివేక్ త్రివేది తెలిపారు.

## రాజు గారి ప్రీ వెడ్డింగ్...

**బలగం టీవీ, హైదరాబాద్**



జాతిరత్నాలు, 'మిస్ శెట్టి మిస్టర్ పొలిశెట్టి'తో సక్సెస్ సాధించిన స్టార్ హీరో నవీన్ పొలిశెట్టి తాజాగా మరో కొత్త సినిమాతో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. 'అనగనగ ఒక రాజు' అనే టైటిల్‌తో తెరకెక్కుతోన్న సినిమాలో ఆయన కీ రోల్ ప్లే చేయను న్నారు. ఇప్పటికే విడుదలైన టీజర్, గ్లింప్స్‌తో ఆడియెన్స్‌లో ఈ సినిమాపై అంచనాలు ఏర్పడ్డాయి. అయితే తాజాగా ప్రీ వెడ్డింగ్ వీడియో అంటూ మేకర్స్ మరో స్పెషల్ గ్లింప్స్‌ను విడుదల చేశారు. నవీన్ పుట్టినరోజు సందర్భంగా వచ్చిన ఆ గ్లింప్స్ కామెడీ ఎంటర్‌టైనర్‌గా సినిమా ఉండబోతోందని చెబుతోంది.. ఇక నటి మీనాక్షి చౌదరి ఈ సినిమాలో నటిస్తున్నట్లు మేకర్స్ రివీల్ చేశారు.

రాజుగారి పెళ్లిలో కాజు కట్లీ కూడా బంగారం రేకుతోనే ఉండాలి అంటూ స్టార్టింగ్?లో రిచ్?గా చూపించారు. ఆ తర్వాత ముకేశ్ అంబానీకి ఫోన్ చేసి అనంత్ మ్యారేజ్‌కు వచ్చిన సెలబ్రిటీల గురించి ఫన్నీగా ఆరా తీస్తుంటారు నవీన్. ఆ ఈవెంట్‌కు వచ్చిన కొందరు సెలబ్రిటీలను ఇక్కడి సంగీత్ కు తీసుకురమ్మంటూ చెప్తుంటారు. ఆ తర్వాత ప్రీ వెడ్డింగ్ ఫోటో షూట్‌లో నవీన్, మీనాక్షి ఫొటోలు తీసుకునే విధానం కూడా ఫన్నీగా ఉంటుంది.

## పెళ్లి గురించి శ్రుతి హాసన్ క్లారిటీ

**బలగం టీవీ, హైదరాబాద్**

నట్టి శ్రుతి హాసన్ తాజగా ఓ ఇంటర్వ్యూలో పెళ్లి గురించి ప్రస్తావించారు. వివాహబంధంపై తనకున్న నిర్ణయాన్ని వెల్లడించారు. పెళ్లి చేసుకోవడం తనకు ఇష్టం లేదని శ్రుతి గతంలో చెప్పారు. అయితే తాజాగా దీనిపై ఆమె క్లారిటీ ఇచ్చారు. "లైఫ్ ఎప్పుడూ ఒకేలా ఉండదు. ఊహించని విధంగా ఎన్నో మార్పులు జరుగుతుంటాయి. అయితే నేను పెళ్లి చేసుకోను అని చెప్పాను కానీ ఎప్పటికీ చేసుకోనని చెప్పలేదు కదా! నేను రిలేషన్‌లో ఉండడానికి ఇష్టపడతాను. రొమాంటిక్‌గా ఉండటం నాకు ఇష్టం. నా చుట్టూ ఉండేవారితోనూ నేను చనువుగానే ఉంటాను. అయితే ప్రస్తుతానికి మాత్రం పెళ్లి చేసుకునే ఉద్దేశం లేదు. భవిష్యత్తులో ఎవరైనా సరే నా మనసుకు దగ్గరైతే వారిని తప్పకుండా వివాహం చేసుకుంటాను. ఇది పూర్తిగా నా వ్యక్తిగత నిర్ణయం. ఇక నా స్నేహితులు, బంధువులు ఎంతోమంది పెళ్లి తర్వాత చాలా సంతోషంగా ఉన్నారు" అని అన్నారు.




## ఓటీటీలోకి 'కేసీఆర్'

**బలగం టీవీ, హైదరాబాద్**

రాకింగ్ రాకేశ్ కథానాయకుడిగా నటిస్తూ, నిర్మించిన తాజా చిత్రం కేశవ చంద్ర రమావత్ (కేసీఆర్). ఈ సినిమాకు 'గరుడ వేగ' అంజి దర్శకత్వం వహించగా.. అనన్య కృష్ణన్, లోహిత్, మైమ్ మధు, తనికెళ్ల భరణి, తాగుబోతు రమేష్, ధనరాజ్, జోర్దార్ సుజాత తదితరులు కీలక పాత్రల్లో నటించారు. నవంబర్ 22న థియేటర్లలో ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ చిత్రం తాజాగా ఓటీటీలోకి రాబోతుంది. ప్రముఖ తెలుగు ఓటీటీ వేదిక ఆహాలో ఈ సినిమా డిసెంబర్ 28 నుంచి స్ట్రీమింగ్ కాబోతున్నట్లు చిత్రబృందం ప్రకటించింది. ఈ సందర్భంగా ట్రైలర్‌ను విడుదల చేసింది.

ఉద్యమ నాయకుడిగా కేసీఆర్ జర్నీతో పాటు, ఆయన అభిమానిగా కేశవ ఎదిగిన తీరును ఈ సినిమాలో చూపించారు. కసీఆర్ అభిమాని పాత్రలో రాకేష్ చక్కని నటనతో మెప్పించాడు.